సాక్షి
గుంటూరు
గురువారం । 12 । డిసెంబర్ । 2024




కంది పైరు పరిశీలన

కారెంపూడి: సౌభాగ్య 133-33 కంది వంగడాన్ని సాగు చేసిన పొలాన్ని గుంటూరు లాం ఫాం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. రైతుకు సూచనలు చేశారు.



సత్తెమ్మతల్లి దర్శనం

అచ్చంపేట: మాదిపాడు అటవీప్రాంతంలో సత్తెమ్మ తల్లిని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆయనకు స్వాగతం పలికారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 582.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

14న ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా 50వ జూనియర్స్ బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలను ఈ నెల 14న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ డిగ్రీ కళాశాలలో ఆ రోజు ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని ఆయన సూచించారు.

సౌదీ అరేబియాలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

బాపట్ల: బీఎస్సీ నర్సింగ్, పోస్టు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్నవారికి సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18- 40 సంవత్సరాల్లోపు వారు ఈ నెల 15వ తేదీలోగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థలో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఏడాదిన్నరపాటు ఏదైనా హాస్పిటల్‌లో పనిచేసిన అనుభవంతోపాటు సౌదీ అరేబియాలో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 89788 86348, 98666 37945, 99888 53335 ఫోను నంబర్లలో సంప్రదించాలని కోరారు.

యార్డుకు 51,004 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 51,004 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 49,509 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,119 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు నత్తు





ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు విజయనగరం జిల్లాకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విలువైన బంగారు నత్తును కానుకగా సమర్పించారు. చీపురుపల్లికి చెందిన వేలూరి అమోఘ్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చారు. సుమారు 10.5 గ్రాముల బంగారం, ఎరుపు, పచ్చ రాళ్ల పొదిగిన నత్తును దేవస్థాన అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ డీఈఓ రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

మోపిదేవి కార్తికేయుడికి రూ.96.77 లక్షల ఆదాయం



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 96.77 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కృష్ణా జిల్లా దేవదాయశాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు జరిగింది. 96 రోజులకు రూ.96.77 లక్షల నగదుతోపాటు 1.560 కిలోల వెండి, బంగారం 33.300 గ్రాములు, 37 అమెరికన్ డాలర్లు వచ్చాయని ఈఓ తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, పోలీస్ అధికారులు, ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, పాల్గొన్నారు.

'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' పోస్టర్ ఆవిష్కరణ



వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 13వ తేదీన 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' అనే కార్యక్రమం నిర్వహించనున్నారు. సంబంధిత పోస్టర్లను బుధవారం మేడికొండూరు మండలం జంగంగుంట్లపాలెం పర్యటనలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఆవిష్కరించారు. – మేడికొండూరు



గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పాల్గొన్నారు. – పట్నంబజార్



పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' పోస్టర్ ఆవిష్కరించారు. చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో రైతులను కలిశాక అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ..13న జరగబోయే కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. – పొన్నూరు

అంచనాకు అంధనంత!

గుంటూరు నగరంలో అక్రమాల పునాదులపై ప్లానింగ్ విభాగ అధికారులు అవినీతి సామ్రాజ్యం నిర్మించుకుంటున్నారు. వీళ్లదో ప్రత్యేక రాజ్యాంగం. వీరు ఎవరికీ సమాధానం చెప్పాల్సిన పనిలేదు. నిత్యం అవినీతి అక్రమాల్లో మునిగి తేలుతుంటారు. నిబంధనల అమలులో లోపాలు ఉన్నాయని సుమారు 400 మందికి నోటీసులు ఇచ్చిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది.. వారి నుంచి సుమారు రూ. ఏడెనిమిది కోట్ల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవినీతికి పక్కా 'ప్లాన్'

- ఎవరికి వారే డాన్!
- హైకోర్టు ఆదేశాలూ బేఖాతర్
- షోకాజ్ నోటీసుల పేరుతో రూ.కోట్లలో వసూళ్లు
- అవినీతి అధికారులకే కీలక బాధ్యతలు అప్పగింత
- రెండు సార్లు ఏసీబీ దాడుల్లో చిక్కిన ఆ అధికారికే అందలం
- ఇదీ.. జీఎంసీ అధికారుల నిర్వాకం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిబంధనల అమలులో లోపాలు ఉన్నాయని 1,187 భవనాలను షార్ట్‌ఫాల్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో రాజకీయ పలుకుబడి ఉన్నవారు, అధికార పార్టీకి చెందిన వారిని పక్కన పెట్టేశారు. మిగిలిన వారిలో తాము పీక్కుతినే వారిని గుర్తించారు. వారికి మాత్రమే నోటీసులు ఇచ్చారు. వీరి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. ఇందులో కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకూ అందరి పాత్ర ఉందని తెలుస్తోంది. నాలుగు నెలల క్రితం గుంటూరుకు వచ్చిన అధికారులు ప్రతి డివిజన్‌లో తమ సొంత వ్యవస్థను ఏర్పాటు చేసుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ కమిషనర్ మాత్రం నోరు మెదపడం లేదు. వాస్తవాలను, హైకోర్టు ఉత్తర్వులను కూడా మరుగున పెట్టి అధికార పార్టీ కాని వారిని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది బెదిరిస్తున్నారు.

కమిషనర్‌ను తప్పుదోవ పట్టించి మరీ..!

గుంటూరులో ఒక భవనానికి సంబంధించిన బిల్డర్‌కు అధికారులు నోటీసు ఇచ్చారు. దీంతో బిల్డర్ వెంటనే హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఉత్తర్వులను సిటీ ప్లానింగ్ అధికారులు కమిషనర్‌కు చేరనివ్వలేదు. ప్రణాళికా విభాగంలోనూ ఉత్తర్వు కాపీని మాయం చేశారు. కాపీని నోట్‌ఫైల్‌లోనూ ఉంచలేదు. బిల్డర్ సమాధానం ఇవ్వలేదని సాకుతో కమిషనర్‌ను తప్పుదోవ పట్టించారు. భవన నిర్మాణదారులపై చర్యలకు సిటీప్లానర్ ఫైల్ నడిపారు. చివరి నిమిషంలో నిజం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవద్దని ఫైల్‌ను నిలుపుదల చేశారు. ఇదిలా ఉండగా మరి కొందరు బిల్డర్ల విషయంలోనూ కోర్టు ఉత్తర్వులను మరుగున పెట్టినట్టు సమాచారం.

సిటీ ప్లానింగ్ ... అక్రమాలు కోకొల్లలు



ఎల్‌టీపీకి నోటీసు జారీపై విస్మయం

సదరు భవన యజమానికి ప్లాన్ ఎందుకు రద్దు చేయకూడదని నోటీసు ఇచ్చిన ప్రణాళిక విభాగం అధికారులు ఎల్‌టీపీ విషయంలో అడ్డదిడ్డంగా వ్యవహరించారు. సదరు బిల్డింగ్ ప్లాన్ రద్దు అయిందని, మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌కూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. మేము బిల్డర్ ప్లాన్ రద్దు చేశామని అబద్ధం చెబుతూ ఎల్‌టీపీకి నోటీసు జారీ చేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎల్‌టీపీ లైసెన్స్ రద్దయిందని బయట దుష్ప్రచారం నడుస్తోంది. ఇంత అడ్డగోలుగా వ్యవహరిస్తున్న తీరు గతంలో కార్పొరేషన్‌లో ఎన్నడూ చూడలేదని బిల్డర్లు చెబుతున్నారు. ఇది ఇలా ఉండగా ఒక అధికారిపై రెండు సార్లు ఏసీబీ రైడింగ్‌లు జరిగాయి. అదే టౌన్ ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఇప్పుడు ఏకంగా అసిస్టెంట్ సిటీప్లానర్ ఇన్‌చార్జిగా రెండు జోన్లు అప్పగించడమే కాకుండా ఏకంగా నగరంలోని సగానికి పైగా డివిజన్లు కట్టబెట్టారు. దీన్నిబట్టి ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మొత్తం 57కుగాను 29 డివిజన్ల బాధ్యత సదరు అధికారికి అప్పగించారు. కొంతమంది అధికారులు ఫేక్ సర్టిఫికెట్లతో ప్రమోషన్లు పొందారన్న అభియోగాలు కూడా ఉన్నాయి. ఉన్నతాధికారుల అండదండలతోనే టౌన్‌ప్లానింగ్‌లో ఇష్టారాజ్యంగా అక్రమాల వ్యవహారం నడుస్తోందని ఆరోపణలు బలంగా ఉన్నాయి.

రూ.కోట్లలోనే వ్యవహారాలు

గుంటూరు నగరంలోని టౌన్ ప్లానింగ్ సిబ్బంది షార్ట్‌ఫాల్స్ పేరిట భారీగా వసూలు చేసి ఉంటారని ఒక అంచనా. డైరెక్టర్ ఆఫ్ టౌన్, సిటీ ప్లానింగ్ విభాగంలో పై స్థాయి నుంచి కింది స్థాయి వారి వరకు ఈ ముడుపులు చేరతాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడ టౌన్ ప్లానింగ్ విభాగంలో పోస్టింగ్ కావాలంటే రూ.కోటికిపైగానే చదివించుకోవాల్సి ఉంటుంది. అంత పెద్ద మొత్తం అయినా ఇక్కడి పోస్టింగ్‌లకు చాలా డిమాండ్ ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ వచ్చే ఆదాయం ఆ స్థాయిలో ఉంటుంది కాబట్టి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల 21 మంది గుంటూరు కార్పొరేషన్‌కు వచ్చారు. వీరంతా డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్‌తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులకు రూ.కోట్లు ఇచ్చి మరీ వచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోస్టింగ్‌లకు వచ్చిన వారిలో అవినీతి అనకొండలే ఎక్కువగా ఉన్నాయి.

ప్రజాప్రతినిధుల సహకారం

గుంటూరు నగరంలో అధికార పార్టీకి ఒక కేంద్ర సహాయ మంత్రి, ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరంతా ఈ దోపిడీకి పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా తమకు అన్యాయం జరుగుతోందని గట్టిగా మాట్లాడితే.. వెంటనే ప్రజాప్రతినిధుల నుంచి టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి మద్దతుగా ఫోన్లు వస్తున్నాయని చెబుతున్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, వేదికపై ఏఎస్పీ సుప్రజ తదితరులు

- జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్
- పోలీస్ స్పోర్ట్స్–గేమ్స్ మీట్ ప్రారంభం

నగరంపాలెం: క్రీడా పోటీలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. నగరంపాలెం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్- గేమ్స్ మీట్ పోటీలను బుధవారం జిల్లా ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యం విధుల్లో నిమగ్నమయ్యే పోలీసులకు మానసిక ఉల్లాసాన్ని పెంచేందుకు క్రీడలు దోహదం చేస్తాయని, నాయకత్వ లక్షణాలు కూడా అలవాటు అవుతాయని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. 8 విభాగాల (ఆరు సబ్ డివిజన్లు, ఏఆర్, హెడ్ క్వార్టర్ విభాగం–1) నుంచి సుమారు 150 మంది సత్తా చాటేందుకు పోటీ పడుతున్నారు. జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైమ్), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న దృశ్యం



పరుగు పందెంలో మహిళలు

కంటైనర్‌ను ఢీకొన్న లారీ

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం
- పేలుడు పదార్థాల లోడుతో కంటైనర్

మేదరమెట్ల: పేలుడు పదార్థాల లోడుతో వెళుతున్న ఆర్మీకి చెందిన కంటైనర్‌ను వెనుక నుంచి బియ్యం లోడుతో వెళుతున్న లారీ ఢీకొన్న సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. రెండు గంటల ప్రాంతంలో కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం సమీపంలో ఢీకొన్న లారీ నుంచి మంటలు రావడంతో స్థానికులు అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో అక్కడకు చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేసి క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీశారు. ముందున్న కంటైనర్ మహారాష్ట్ర నుంచి చెన్నైకు ఆర్మీకి చెందిన పేలుడు పదార్థాలతో మరో 11 కంటైనర్‌లతోపాటు బయలు దేరింది. కంటైనర్లు బొడ్డువానిపాలెం వద్ద బంకులో పెట్రోలు కొట్టించుకునేందుకు రోడ్డు పక్కన ఆగాయి. అదే సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో నిలిపిన మిగిలిన కంటైనర్లను కిలోమీటరు దూరంలోకి తీసుకెళ్లి ఆపుకొన్నారు. మేదరమెట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు.



ఆర్మీకి చెందిన కంటైనర్‌ను ఢీ కొన్న లారీ

ఇక సాగు నీటి సమరం

సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ప్రభుత్వం వీటి ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసింది. ఈ నెల 14న సాగునీటి సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రాజెక్టు కమిటీ ఎన్నికల తేదీని ఇందులో ప్రకటించలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోని సాగునీటి సంఘాల వ్యవస్థను మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చినట్టయింది. వాస్తవానికి ఈ నెల 5న రావాల్సిన నోటిఫికేషను ఆలస్యమైంది.



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ

- 14, 17 తేదీల్లో సంఘాలకు ఎన్నికలు
- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఇప్పటికే ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ
- కృష్ణా పశ్చిమ డెల్టాలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఆ ఆయకట్టు ఉండేది. ఇందులో అత్యధిక విస్తీర్ణం తెనాలి డివిజనులో ఉండేది. జిల్లాల విభజన అనంతరం ఇప్పుడు పశ్చిమ డెల్టా పరిధి గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు విస్తరించింది. ఆ ప్రకారం ఇప్పుడు సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ కొంతకాలంగా జరుగుతూ వస్తోంది. పశ్చిమ డెల్టాలో మొత్తం 144 సాగునీటి వినియోగదారుల సంఘాలను నిర్ణయించారు. వీటిలో గుంటూరు జిల్లాలో 50, బాపట్ల జిల్లాలో 92, ప్రకాశం జిల్లాలో రెండు చొప్పున ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 20 కాగా, జిల్లాలో ఆరు, బాపట్ల జిల్లాలో 14 ఉన్నాయి. గుంటూరు చానల్ పరిధిలో మరో 14 సాగునీటి సంఘాలు, రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీలున్నాయి. వీటన్నింటిపైన ప్రాజెక్టు కమిటీ ఉంటుంది. సాగునీటి సంఘాల ఎన్నికలకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పర్యవేక్షిస్తారు. మూడు జిల్లాలకు ముగ్గురు నోడల్ అధికారులను నియమించారు. జిల్లాకు జలవనరుల శాఖ గుంటూరు ఈఈ కె.రమేష్, బాపట్లకు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీరు పులిపాటి వెంకటరత్నం, ప్రకాశం జిల్లాకు జలవనరుల శాఖ ఏఈ శంకరరావు నియమితులయ్యారు.



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వ

చురుగ్గా ఏర్పాట్లు

కృష్ణా డెల్టా పరిధిలోని పశ్చిమ డెల్టాలో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు గత నెల మూడో వారంలో నిర్వహించారు. మిగతా ఏర్పాట్లకు సంబంధించిన సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయి. బుధవారం విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 14న సాగునీటి సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ సంఘాలకు ఎన్నికలను నిర్వహిస్తారు. సాగునీటి సంఘాల ఎన్నికలు రెండు విభాగాలుగా జరుగుతాయని అధికారులు తెలియజేశారు. ఉదయం టీసీ సభ్యుల (ప్రాదేశిక సభ్యులు) ఎన్నిక ఉంటుంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. ప్రాజెక్టు కమిటీ ఎన్నికను నోటిఫికేషన్‌లో ప్రస్తావించలేదు.

సజావుగా నిర్వహిస్తాం



సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 14, 17వ తేదీల్లో ఎన్నికలు సజావుగా జరిగేలా తగిన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ తరగతులు పూర్తి చేశాం.

– పులిపాటి వెంకటరత్నం, ఎస్ఈ, జల వనరుల శాఖ

ఎన్నిక విధానం ఇలా...

కృష్ణా పశ్చిమ డెల్టాలోని నీటి సంఘాల్లో 3.5 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 18 ఏళ్ల వయసు కలిగినవారు ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. ప్రభుత్వ ఉద్యోగి/పింఛనుదారు పోటీకి అర్హులు కారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు, పారితోషికాలు పొందేవారు అనర్హులు. ఎన్నికల్లో పోటీచేసేవారు నీటిశిస్తు చెల్లించి ఉండాలనే నిబంధన ఉంది. ఇక ఎన్నికలను మూడు విధాలుగా జరుపుతారు. తొలుత అక్షరమాల ప్రకారం అభ్యర్థుల వరుసక్రమాన్ని నిర్ణయిస్తారు. ముందుగా ఏకగ్రీవం అవుతుందేమో చూస్తారు. లేకుంటే అభ్యర్థుల వరుసక్రమం ప్రకారం తొలి అభ్యర్థిని వేదికపైకి పిలిచి చేతులు పైకెత్తే విధానంలో ఎన్నిక జరుగుతుంది. ఎవరికి ఎక్కువ మద్దతు వస్తే వారిని విజేతలుగా ప్రకటిస్తారు. చేతులెత్తే విధానం వీలుపడకపోతే రహస్య బ్యాలెట్‌ను అనుసరిస్తారు. ఓటు చేసే రైతులకు పట్టాదారు పాసు పుస్తకం లేకపోయినా ఓటు హక్కును నిరాకరించరు. ఓటరు కార్డు, ఆధార్ కార్డు లేదా ఏ ఇతర గుర్తింపు కార్డుతోనైనా ఓటు చేసే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1800 గరిష్టం : రూ. 2,400

మోడల్ ధర రూ. 2,100

క్లుప్తంగా

266 పరుగులకు రాజస్థాన్ ఆలౌట్



అర్ధ సెంచరీ చేసిన యశ్వంత్ భరద్వాజ్

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి క్రికెట్ టౌన్‌షిప్‌లో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన విజయ్ మర్చంట్ ట్రోఫీ (అండర్ 16 మెన్) క్రికెట్ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు 266 పరుగులకు ఆలౌటైంది. బుధవారం రాజస్థాన్ , ఉత్తరాఖండ్ జట్ల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ జట్టు 82.01 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. రాజస్థాన్ బ్యాట్స్‌మెన్‌లు యశ్వంత్ భరద్వాజ్ 8 ఫోర్లతో 50 పరుగులు సాధించాడు. ఎస్.ఖాన్ 48 పరుగులు చేశాడు. ఉత్తరాఖండ్ బౌలర్లు అభిమన్యు, ఎండీ షాహిద్ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు 5 ఓవర్లలో 8 పరుగులు సాధించింది.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: పాఠశాల తరగతి గదిలో నిద్రించిన ఉపాధ్యాయుడికి జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.వి. నారాయణ మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలో ఉన్న విద్యార్థులను పక్కనున్న అంగన్‌వాడీ కేంద్రంలోనికి పంపి, పాఠశాల తరగతి గదిలో నిద్రిస్తున్నారంటూ బుధవారం 'సాక్షి'లో 'గుర్రువు గారూ ఇది తగునా..!' శీర్షికన వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాలలో ఎంఈవోలు సీహెచ్. రమాదేవి, జి. లీలారాణిలు విచారణ జరిపి డీఈవోకు నివేదిక అందించారు. హెచ్‌ఎం కొంత అస్వస్థతకు గురై, ఆరోగ్యం సహకరించక విద్యార్థులను అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచి విశ్రాంతి తీసుకున్నారని, ఈ మేరకు అంగన్‌వాడీ సహాయకురాలు లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చారని నివేదికలో పేర్కొన్నారు. దీంతో ఎంఈవోలు ఇచ్చిన నివేదిక ఆధారంగా సదరు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసుతో పాటు ఆర్టికల్స్ ఆఫ్ చార్జెస్ కూడా జారీ చేసినట్లు డీఈవో సి.వి. రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు మిగిలింది కన్నీరే!

- ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు శూన్యం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- మేడికొండూరు మండలం జంగంగుంట్లపాలెంలో పర్యటన
- పెదకాకాని మండలం వెంకట కృష్ణాపురంలోనూ ధాన్యం పరిశీలన
- రైతుల సమస్యలు తెలుసుకుని ఓదార్చిన నాయకులు
- రేపు అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ భారీ ర్యాలీ

కూటమి పాలనలో వంచనకు గురవుతున్న అన్నదాతలు



వెంకట కృష్ణాపురంలో ధాన్యం పరిశీలిస్తున్న అంబటి రాంబాబు, మురళీకృష్ణ

మేడికొండూరు/పెదకాకాని/శలపాడు (చేబ్రోలు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల కంట పాలకులు కన్నీరు పెట్టిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలో జంగంగుంట్లపాలెం గ్రామంలో తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు)తో కలిసి అంబటి రాంబాబు బుధవారం పర్యటించారు. పెదకాకాని మండలంలోని వెంకట కృష్ణాపురం గ్రామంలో, చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో అంబటి రాంబాబు, పొన్నూరు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పర్యటించి, స్థానిక రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు.

పెట్టుబడి సాయం దిక్కే లేదు...

ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో రైతులు నష్టపోతున్న తీరును వివరించారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా అన్నదాత సుఖీభవ పేరిట ఏటా రూ.20 వేల ఆర్థిక సహాయం చేస్తానన్న చంద్రబాబు అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని పేర్కొన్నారు. ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర బడ్జెట్లో రూ. 10,700 కోట్లు కేటాయించాల్సి ఉండగా.. అసలు ఆ ప్రస్తావనే చేయలేదని విమర్శించారు. దళారీ వ్యవస్థతో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల నుంచి 10 శాతం మాత్రమే ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపారు. దళారులు తక్కువ ధరకు ధాన్యం కొని రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతులను ఎన్నిసార్లు మోసం చేస్తావయ్యా చంద్రబాబు.. అంటూ నిలదీశారు. కూటమి ప్రభుత్వం చేసిన నమ్మక ద్రోహాన్ని ప్రతి రైతు నిలదీయాలని పిలుపునిచ్చారు. ధాన్యం బాగున్నా అధికారులు కొనుగోలు చేయడం లేదని, తేమ శాతం సాకుగా చూపుతున్నారని పార్టీ నాయకులకు రైతులు తెలిపారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అంబటి తెలిపారు. రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. పలు ప్రాంతాల్లో కూటమి నాయకులే దళారులుగా మారి తక్కువ ధరకు రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు కొనుగోలు చేశామన్నారు. రైతులతో కలిసి వరి పొలాలు, ఆరబెడుతున్న ధాన్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వీటిలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. అనంతరం రైతు ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. జంగంగుంట్లపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కందుల సిద్దయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, జంగంగుంట్ల పాలెం గ్రామ సర్పంచ్ కళ్లి శ్రీదేవి సాంబిరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ చంటి బాజీ, కిషోర్ రెడ్డి, కోటిరెడ్డి, లూర్థు రాజు, రసూల్, అబ్బాస్, ముత్యాల బాలస్వామి, అల్లూ శ్రీనివాసరెడ్డి, పల్లపు శ్రీను, పాములపాటి జయరావు, నాగుల్ మీరా, హేమలత రెడ్డి, ఉడత ప్రభాకర్, కొటికల దాసు, కొక్కెర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకట కృష్ణాపురంలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ యాదవ్, శివాలయం మాజీ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర్రావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కానుగోలు శంకరరావు, తోటకూర వెంకటేశ్వరరావు, అగతవరప్పాడు సర్పంచ్ పిట్టు శివకృష్ణారెడ్డి, నాయకులు గోళ్ళ జోసెఫ్, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు శివాబత్తుని దయానంద్, భీమవరపు విజయలక్ష్మి, చిలకా కిషోర్, తోటకూర సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మన్నెం శిరీష, ఎంపీటీసీ యు. వెంకటేశ్వరరావు, జయపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు మన్నెం వేణుగోపాలరావు, ఉయ్యూరు బాలచంద్రయ్య, పరిశా పూర్ణచంద్రరావు, ఆళ్ల శ్రీరామిరెడ్డి, శేషిరెడ్డి, శ్రీరెడ్డి, చందు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



జంగంగుంట్లపాలెంలో వరి పైరు పరిశీలిస్తున్న రాంబాబు, బాల వజ్రబాబు

జయప్రదం చేయాలని పిలుపు

పట్నంబజారు: ఈ నెల 13వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతన్నల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసే కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, రైతులు జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం బృందావన్ గార్డెన్స్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా సమన్వయకర్తలు, ముఖ్య నేతలు, రైతు నేతలతో సభా కార్యక్రమం జరిగింది. వినతి పత్రాల కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లు ఆవిష్కరించారు. దీనిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, నేతలు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్ వలి, మండేపూడి పురుషోత్తం, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మెట్టు వెంకటప్పారెడ్డి, ఆళ్ల రవిదేవరాజ్, పార్టీ నేతలు, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కారు విఫలం

పొన్నూరు: ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పట్టణంలోని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ విమర్శించారు. రైతులు కష్టపడి పండించి ధాన్యానికి మద్దతు ధర విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయంపై వారికి అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 13వ తేదీన 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు మురళీకృష్ణ తెలిపారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో భారీ ర్యాలీ, అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ రూత్ రాణి, షేక్ నాజర్, వట్టిప్రోలు రంగారావు, సర్పంచ్ చుండూరు వీరయ్య, దేవరకొండ గోపి, షేక్ జాని, మూర్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐ రాకతో ఫార్మా పరిశోధనలు విస్తృతం



సావనీర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ... మారుతున్న ఆహార అలవాట్ల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియపరచడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషించాలన్నారు. ముఖ్య వక్తగా మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఉన్న మంగళయాటన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య కేఆర్‌ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ కృత్రిమ మేధతో ఆధునిక పరిశోధన రంగం వేగవంతం కావాలని ఆయన పిలుపునిచ్చారు. భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఐ.బాలకృష్ణ మాట్లాడుతూ.. సమాజాభివృద్ధికి తోడ్పడే ఆవిష్కరణలు చేయాలని తెలిపారు. బెంగళూరులోని అల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎండీ సలాహుద్దీన్ ఔషధాల అభివృద్ధి ప్రక్రియ వేగవంతమైందని వివరించారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి. రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.ప్రమీల రాణి అధ్యక్షత వహించారు. సదస్సులో రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, కో కన్వీనర్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.సుజన, కోశాధికారి డాక్టర్ కేఈ ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.మస్తానమ్మ, కె. విజయ్ కిషోర్, తెనాలిలోని ఏఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె .వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జీడీసీఏకు తాత్కాలిక కమిటీ నియామకం



మనోజ్ సాయి, మహతి శంకర్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు ముగ్గురు సభ్యుల తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేస్తూ ఏసీఏ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉన్న కమిటీతోపాటు గతంలో ఉన్న కమిటీల మధ్య కొంత వివాదం నేపథ్యంలో గత నెల 29, 30వ తేదీల్లో ఏసీఏ విచారణ జరిపింది. దీంతో వివాదాలు పరిష్కారమయ్యే వరకు గుంటూరుకు చెందిన మాజీ రంజీ, దేవదర్ ట్రోఫీ క్రికెటర్లు వేముల మనోజ్ సాయి, బోడా సుధాకర్ యాదవ్‌తోపాటు న్యాయవాది, మాజీ క్రికెటర్ ఉమ్మడిశెట్టి మహతి శంకర్‌లను కమిటీ సభ్యులుగా నియమించింది. ఈ సందర్భంగా మనోజ్ సాయి, మహతి శంకర్‌లు మాట్లాడుతూ.. ఏసీఏ ఆదేశాల మేరకు తాము పనిచేస్తామన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక అరండల్‌పేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్-12 బాలుర జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తామన్నారు.

ఉరుకులు పరుగులతో కట్టేతలు

నగరం: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట చేతికందే తరుణంలో వాతావరణంలో మార్పులతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమవ్వడంతో కోతలు కోసిన రైతుల గుండెల్లో ఆందోళన నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లో 3వేల ఎకరాలల్లో దాకా వరి పంట ఓదెల రూపంలో ఉంది.ఈ తరుణంలో కారు మబ్బులు పట్టి చిరు జల్లులు పడుతుండటంతో రైతులు హడావుడిగా కట్టేతలు కడుతున్నారు. రైతుల ఆందోళన, వాతావరణంలోని మార్పులను ఆసరా చేసుకుని కూలీలు ఒక్కసారిగా రేట్లు పెంచేశారు. వరి కట్టేతలకు ఎకరానికి సాధారణ పరిస్థితులలో రూ. 5,000 నుంచి రూ. 5,500 వరకు ఉండేది. ఇప్పుడు ఎకరానికి రూ. 7,000 నుంచి రూ. 7500కు చేరింది.

అంగలేరు వాగులో పడి యువకుడి మృతి

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామంలో గేదెలను పొలానికి తోలుకుని వెళుతుండగా మార్గమధ్యంలో అంగలేరు వాగులో పడి యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన దావులూరి హరీష్ (20) గేదెలను పొలానికి మేత కోసం తోలుకొని వెళుతుండగా గ్రామ సమీపంలో ఉన్నటువంటి అంగలేరు వాగు మధ్యలో ఏర్పాటు చేసిన చెక్‌డ్యామ్‌లో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు, వీఆర్వో ఉప్పులూరి మంగయ్య పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కేటింగ్‌లో మెరిసిన చిన్నారులు



గోల్డ్ మెడల్ సాధించిన మెరుగుపాల ఆశిష్



సందు కోటేశ్వర్

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్‌కు చెందిన బాలుడు మెరుగుపాల ఆశిష్, ఉండవల్లికి చెందిన విద్యార్థి సందు కోటేశ్వర్ స్కేటింగ్‌లో ప్రతిభ చాటారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించారు. స్థానికులు బుధవారం వారిని అభినందించారు. డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల ఆశిష్ 11, 14 సంవత్సరాల వయస్సు కలిగిన స్కేటింగ్ కేటగిరీలో జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాడు. సందు కోటేశ్వర్ 9-11 సంవత్సరాల విభాగంలో జాతీయ స్థాయిలో సత్తా చాటి స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. మూడు సంవత్సరాల నుంచి కోటేశ్వర్ జాతీయ స్థాయిలో పలు పోటీల్లో పతకాలు సాధిస్తూ తన సత్తా చాటుతున్నాడు.

కుంకలగుంటలోని ఆలయంలో చోరీ



కుంకలగుంటలోని ఆలయంలో చోరీ జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు



కుంకలగుంటలోని ఆలయం వెనుక భాగంలో పగలగొట్టి ఉన్న హుండీలు

నకరికల్లు: కుంకలగుంటలోని శ్రీకార్యసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ చల్లా సురేష్ కథనం ప్రకారం.. ఆలయంలో శనివారం రాత్రి పూజలు ముగించుకున్న పూజారి కారంపూడి రాఘువాచార్యులు ప్రధాన గేటుకు తాళాలు వేసి వెళ్లారు. బుధవారం ఉదయం 6గంటల సమయంలో ఆలయ ప్రాంగణం శుభ్రం చేసేందుకు వచ్చిన మహిళకు గేటు తాళాలు పగలగొట్టి ఉండడంతోపాటు రెండు హుండీలు పగులగొట్టి ఆలయం వెనుక భాగంలో కన్పించడంతో ఆలయ నిర్వాహకులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనాస్థలానికి పోలీసులతోపాటు క్లూస్‌టీం చేరుకొని ఆధారాలు సేకరించారు. ప్రధాన గేటు తాళాలు పగులగొట్టిన దుండగులు ఆలయంలోని రెండు హుండీలను వెనుకభాగానికి తీసుకువెళ్లి అందులోని సుమారు రూ.45వేల అపహరించారు. అక్కడి నుంచి వెళ్తూ ఆలయానికి కొద్దిదూరంలోనే ఇంటి వద్ద నిలిపి ఉన్న బజాజ్ ప్లాటినా ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ కూడా అపహరించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

ప్రయోగాలతో విప్లవాత్మక ఫలితాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వీకే సింగ్ తదితరులు

చేబ్రోలు: కొత్త ప్రయోగాలతో విప్లవాత్మక ఫలితాలు వస్తాయని ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ పద్మశ్రీ వీకే సింగ్ అన్నారు. కర్బన ఉత్ప్రేరిత చర్యల ద్వారా విప్లవాత్మక ఫలితాలను సాధించవచ్చునని చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'జాయింట్ ఇండో- ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ సెమినార్ ఆన్ ఎక్స్‌ప్లోరింగ్ కాంటెంపరరీ విస్తాస్ ఇన్ అప్లైయింగ్(ఆర్గానో) కాటలిసిస్ ఫర్ ఫార్మా ఇండస్ట్రీ: ఫర్ సస్టేయినింగ్ ఫ్యూచర్' అనే అంశంపై మూడు రోజుల సెమినార్‌ను బుధవారం ప్రారంభించారు. తొలుత బ్రోచర్ ఆవిష్కరించారు. ప్రొఫెసర్ వీకే సింగ్ మాట్లాడుతూ.. క్రియేటివిటీ ద్వారా పర్యావరణ అనుకూల కాటలిస్ట్‌లను అభివృద్ధి చేయడం సులభమన్నారు. ఇది గ్రీన్ కెమిస్ట్రీ దిశగా ముందడుగు వేసినట్లని పేర్కొన్నారు. సీఈఎఫ్ఐపీఆర్ఏ డైరెక్టర్ ప్రొఫెసర్ నితిన్ సేథ్ మాట్లాడుతూ సీఫిప్రా ద్వారా భారత్ - ఫ్రాన్స్ మధ్య శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అనేక పద్ధతుల్లో మౌలిక సహకారం అందుతోందన్నారు. వివిధ దేశాల ప్రతినిధులు, వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్‌లు డీబీ రామాచారి, పిజ వెంకటేశు, మధుసూదన్, విజ్ఞాన్ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో విజయ్ కుమార్ మృతదేహం

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం జరిగింది. మేడికొండూరు సీఐ నాగుల్ మీరా సాహెబ్ తెలిపిన వివరాల ప్రకారం... నాదెండ్ల మండలం సంకురాత్రి పాడు గ్రామానికి చెందిన నన్నం విజయ్ కుమార్ (35) భార్య గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెను పరామర్శించేందుకు ద్విచక్ర వాహనంపై సంకురాత్రి పాడు నుంచి గుంటూరు వెళుతున్నారు. మార్గమధ్యలో పేరేచర్ల పరిధిలోని రవీంద్ర హోటల్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఈ సంఘటనలో విజయ్ కుమార్ తలకు తీవ్ర గాయమై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి

గుంటూరు రూరల్: రియల్ ఎస్టేట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో కారులో తీసుకెళ్లి అనంతరం దాడి చేసిన ఘటనపై నల్లపాడు పోలీసు స్టేషన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం... చల్లావారిపాలెం గ్రామానికి చెందిన ఇమాబత్తిన నాగేశ్వరరావు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. అతనిని సమీప గ్రామమైన నల్లపాడుకు చెందిన నాగిరెడ్డి, అతని అనుచరులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి గ్రామ శివారులో డబ్బులు డిమాండ్ చేశారు. లేవని చెప్పడంతో దాడి చేశారు. తప్పించుకున్న నాగేశ్వరరావు జీజీహెచ్‌లో చికిత్స పొందారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



కార్యాలయంలో డెప్యూటీ డీఎంహెచ్ఓకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. బుధవారం వారు లింగంగుంట్లలోని 200 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం డెప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతికి వినతిపత్రం అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీయూ ప్రారంభించకపోవడం వల్ల సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. రోగులకు మందులూ అందుబాటులో లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రోగులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటానాయక్ మాట్లాడుతూ రోగులకు సరైన వైద్యం అందడం లేదని విమర్శించారు. రోగులను గుంటూరు జీజీహెచ్‌కు రెఫర్ చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే అనుభవజ్ఞులైన వైద్య సిబ్బందిని ఇక్కడ నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

యడ్లపాడు: ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని యువకుడు తెంచుకుపోయిన ఘటన బుధవారం జరిగింది. మండలంలోని సందెపూడి గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు ఊటుకూరి అనసూయమ్మ ఇంట్లో ఒంటరిగా మంచంపై నిద్రిస్తుండగా బుధవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వచ్చి మీ అబ్బాయితో పనుంది ఇంట్లో ఉన్నాడా అంటూ అడిగారు. లేదని అనసూయమ్మ చెప్పడంతో అయితే పెన్ను పేపర్ ఇవ్వండి మా ఫోన్ నంబర్ రాసిస్తాం. వచ్చాక అబ్బాయి చేత ఫోన్ చేయించండి అంటూ నమ్మ బలికారు. మంచం మీద ఉన్న వృద్ధురాలు కిందికి దిగి పేపరు పెన్నును వెతికే క్రమంలో ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు గొలుసును ఇద్దరూ లాక్కొని పరారయ్యారు. దీంతో బాధితులు యడ్లపాడు పోలీసులను ఆశ్రయించారు.